**కథ**

# కరిగి పోయిన కలలగూడు

– పి.కృష్ణకుమారి

విమల మనసుకి గాలిలో తేలిపోతున్నంత హాయిగా ఉంది. విమల భర్త రంగారావు ఇంకో ఆర్నెల్లలో రిటైరవబోతున్నాడు. ఆయన రిటైరవడం కాదు విమల ఆనందంగా ఉండడానికి కారణం. రిటైర్‌మెంటు బెనిఫిట్స్ చేతికొచ్చాక సొంత ఇల్లు కట్టాలనుకుంటున్నాడు రంగారావు. అద్దె ఇళ్ళల్లో ఉండి ఉండి ప్రాణం వేసారిపోయిన విమలకి తమ కిష్టమైనట్టుగా కట్టుకోబోతున్న సొంత ఇంటిని తలుచుకుంటేనే మనసానంద డోలికల్లో తేలిపోతోంది. ఊరికి కాస్త దూరంగా ఉన్నా చవగ్గా వస్తోంది కదా చాలా కాలం క్రితమే స్థలం కొనేసాడు రంగారావు. ఇప్పుడక్కడ చాలా ఇళ్ళు లేచాయి. చక్కటిచిన్నకాలనీ ఏర్పడింది. స్థలం కొన్నప్పటినించీ విమల మనసు ఊహా సౌధాలు నిర్మిస్తూనే ఉంది.

రోజుల తరబడీ చేసిన ఆలోచనలు నెమ్మదిగా ఒక నిర్దుష్ట రూపం సంతరించుకున్నాయి. ఒక రోజుస్కేలూ పెన్సిలూ తీసుకుని జాగ్రత్తగా ఆలోచనలు కూడదీసుకుంటూ మూడు కాగితాలమీద మూడు రకాల ప్లానులు గీసింది. పెద్ద ఇంజనీరులా కాక పోయినా తమ కుటుంబ అవసరాలు తనకి తెలుసు కాబట్టి తగ్గట్టుగా గదులూ వరండాలూ చిన్న చిన్నవి ఏవి ఎటు ఉండాలో తన మనసుకి నచ్చినట్టుగా గీసుకుంది.

ఇల్లంటూ కట్టుకున్నాక అందులో ఉండబోయేది తామిద్దరే. ఉన్న ఇద్దరు కొడుకులూ వేరే వేరే ఊళ్ళల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. పెద్ద కొడుక్కి పెళ్ళయింది.ఉద్యోగస్థురాలు. కాబట్టి వాళ్ళప్పుడప్పుడూ వచ్చి పోవడం తప్పితే అంతా కలిసి ఉంటే ప్రసక్తి ఇప్పుడప్పుడే లేదు. చిన్నాడిక్కూడా పెళ్ళయి, రెండు జంటలూ శలవు మీద తమని చూడడానికి వచ్చినా ఇబ్బంది లేకుండా ఉండేలా ప్లాను వేసింది విమల. అనవసరపు భేషజాలకి పోకుండా కట్టుకుంటే తమ బడ్జెట్ మించకుండా చక్కని ఇల్లు తయారవుతుందనిపించింది.

ఆ రోజు రాత్రి భర్తకి తను గీసిన ప్లానులు చూపించింది. ఒక్కొక్కదాని గురించీ వివరంగా చెప్పి తనకి ఏది బాగా నచ్చిందో అతనితో చర్చిండడానికి తీరిగ్గా కూచుంది. రంగారావు ఆ కాగితాల వంక ఓ క్షణం చూసి "చూద్దాంలే. మెల్లిగా ఆలోచించవచ్చు." అనేసి అటు తిరిగి గుర్రెట్టి నిద్రపోయాడు. "బాగా అలిసిపోయారులా ఉంది. వయసొకటి మీద పడుతోందాయె." అనుకుని చిన్నబోయిన మనసుకి సర్ది చెప్పుకుంది. విమలకి మాత్రం నిద్ర పట్టలా. తను గీసిన ఇళ్ళకేసే చూస్తూ ఊహల్లో మునిగిపోయింది. అర్ధరాత్రి దాటాక పట్టినా, నిద్రలో కూడా కట్టుకోబోయే ఇంటి గురించే కలలు.

మర్నాడు సాయంత్రం రంగారావు ఆఫీసు నుంచొచ్చాక మళ్ళీ ఇంటిప్లాను గురించి కదపబోయింది. "చూద్దాంలే. నీకన్నిటికీ ఆత్రవూ(ం తొందరానూ" అని విసుక్కుని బయటికి వెళ్ళిపోయాడు. విమల మనసు చివుక్కుమంది. ఈయన ఎన్నేళ్ళయినా మారరు. ఏదీ తనతో చర్చించరు. ఇల్లు కట్టుకోడమంటే ఎంతో ముఖ్యమైన విషయంగా తనకి అనిపిస్తుంటే ఈయన కెందుకంత విసుగు? విమల మనసు రకరకాల ఆలోచనలతో గజిబిజిగా తయారైంది.

మూడోరోజు రంగారావు కాస్త సుముఖంగా ఉన్నాడనిపించి, "నేను ఇంటి గురించి మాట్లాడినప్పుడల్లా మీరు మాట మార్చేసి పోతారెందుకండీ? నేను వేసిన ప్లానులు నచ్చలేదా? అసలేవి(టో చెప్పకూడదా?" అంటూ బతిమాలుతున్న ధోరణిలోనే అడిగింది. 'చూడూ, ఈ ప్లానులూ గీనులూ గీసుకుంటూ నువ్వు హైరాన పడి నన్ను విసిగించకు. నేను పిల్లలిద్దరికీ రాసాను. వాళ్ళొచ్చాక మేమంతా మాటాడుకుని నిర్ణయిస్తాం. వాళ్ళకీ నచ్చాలి. కోడలేమంటుందో. అందరం మాటాడుకుంటాంలే. నువ్వు రంధి పడకు," అన్నాడు.

విమల నిర్ఘాంతపోయింది. తనతోమాట మాత్రమైనా చెప్పకుండా పిల్లలకు రాసాడా? వాళ్ళొచ్చాక వాళ్ళూ వాళ్ళూ మాట్లాడుకుని నిర్ణయించుకుంటారా? తను తప్పుగా విందేమో. ఆయనలాగే అన్నారు కదూ! మేం నిర్ణయిస్తాం. అన్నారు కదూ. లేదు లేదు. తనే తప్పుగా వినుంటుంది. అందరం మాటాడుకుని నిర్ణయిద్దాం అనుంటారు. మనసులో చిన్న చిన్న తుఫానులు చెలరేగుతుంటే కాసిని భ్రమలూ భ్రాంతులూ కల్పించుకుని తనని తాను మభ్యపెట్టుకుని సరిపెట్టుకుంది. "నిజమే. పిల్లలూ ఎదిగారు. వాళ్ళనీ సంప్రదించాలి. ఆయనన్న దాంట్లో తప్పేం లేదు," సర్ది చెప్పుకుంది. కానీ గుండెలో ఏదో బాధ ఎగసి గొంతులో గరళమై కూచుంది. రెండ్రోజుల పాటు తిండి సయించలేదు. నిద్ర మాయమైంది. భర్తతో మాటాడాలనిపించలేదు. మౌనంగానే గడిపింది. ఎంత సర్దుకుపోవాలని చూసినా కుదరలేదు. ఇంకా




కథా నిలయం
శ్రీకాకుళం

ఎన్ని అవమానాలు సహిస్తావు? ఎన్నేళ్ళు సహిస్తావు? అంటూ మనసు సలుపుతూనే ఉంది.

ఉత్తరాలందుకున్న పిల్లలు రానే వచ్చారు. అమ్మ అందించిన వేడి నీళ్ళతో వెచ్చగా స్నానాలు చేశారు. అమ్మ వడ్డించిన భోజనం కమ్మగా అరగించారు. భుక్తాయాసపు మత్తులోనే మధ్యాహ్నం తండ్రీ పిల్లలు సమావేశమయ్యారు. "అమ్మా నువ్వూ వచ్చి కూర్చో" అనాలనే ఆలోచనే ఎవరికీ తట్టలేదు. విమలే మనసుండబట్టక గుమ్మం దగ్గర చతికిలబడింది. రంగారావు ఓ కాయితం తీసి 'ఇదుగోండిరా, నేనిలా ప్లాను వేయించా. నా ఫ్రెండు ఇంజనీరు. గట్టి పిండంలే. మా రిక్వయిర్‌మెంట్లు ఇవీ అని చెప్పాను. గీసిచ్చాడు. చూడండి. అమ్మాయ్! నువ్వూ చూడు నీకూ నచ్చాలిగా!" అంటూ కోడలి చేతికిచ్చాడు.

కోడలికి చెరో ప్రక్కా చేరి కొడుకులిద్దరూ దాన్ని చూసారు. కోడలు లేచి వెళ్ళి పెట్లోంచి తనో రెండు కాయితాలు తెచ్చింది. "మేవూఁ ఊరుకోలేదండీ మామగారూ, మేవూఁ వేయించాం ఓ ప్లాను. మీరూ చూడండి," కాయితాలు ఒకళ్ళ చేతుల్లోంచి ఒకళ్ళు తీసుకుంటూ- ఆవేశంగా, ఆనందంగా, సరదాగా రకరకాలుగా కలగా పులగంగా మాటాడేసుకుంటున్నారు.

కళ్ళల్లోకి తన్నుకొస్తున్న అశ్రువులను గొంతులోనే అదిమి పెట్టి మూగబోయిన మనసుతో జరుగుతున్న హంగామా చూస్తూండి పోయింది విమల.

"ఏదోటి ఫైనలైజ్ చేసి తొందరగా మొదలెట్టెయ్యండి నాన్నా. నేను కూడా ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయించుకొచ్చేస్తాను," పెద్ద కొడుకన్నాడు. "అవునండీ, మామయ్యగారూ. ఆ ఊళ్ళల్లో వెధవ అద్దె కొంపల్లో చస్తున్నాం. ఇంటి పనీ, ఆఫీసు పనీ ప్రాణం పోతోంది. ఎక్కడా మంచి పనివాళ్ళే దొరకట్లేదు. ఇక్కడయితే ఇంటి పనికి అత్తగారుంటారు," కోడలు గారాలు పోయింది. "అవున్నాన్నా, ఇక్కడికొస్తే మీ కోడలు కడుపునో కాయ కాసినా ఇబ్బందుండదు. పిల్లాడి పని చూసేందుకు అమ్మ ఉండనే ఉంటుంది," కోడలు పెద్దాడిని మోచేత్తో పొడిచి, ముసిముసి నవ్వులూ, వాడి పకపకలూ. పెద్దాయన అట్టహాస హాసం. చిన్నాడు సంబరంగా వికవికలాడుకుంటూ, "రేపు నేనూ ఓ ఇంటివాడ్నవుతానని మర్చిపోకండి. నాకూ ఓ గదుంచండి. నేనూ ట్రాన్స్‌ఫర్ కష్లయి చేసా," అన్నాడు. అందరూ సంతోషంతో పగలబడి నవ్వులు.

చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ మాటలు కలపబోయిన విమల గొంతుని కప్పేస్తూ వాళ్ళ గొంతులూ, వాళ్ళ కబుర్లూ.

మాటాడే ప్రయత్నం కూడా మానుకుంది విమల. రోజంతా వండుతూనే వుంది. టిఫిన్లూ, కాఫీలూ అందిస్తూనే ఉంది. రాత్రి భోజనాలు అయ్యాయి. మౌనాన్ని కవచంగా కప్పుకుని రోజంతా గడిపి పక్క చేరిన విమల ఆలోచించింది. చాలా ఆలోచించింది.

అందరికీ ఎప్పట్లా తెల్లారినా విమలకు కొత్తగా తెల్లారింది. "ఇంజనీర్నీ, కాంట్రాక్టర్నీ కలిసొస్తాం" అంటూ పొద్దున్నే టిఫిన్లు తినేసి బయటకు పోతున్న భర్తనీ, కొడుకులనూ, కోడలినీ చూస్తూ గుమ్మం దగ్గర చాలాసేపు నుంచుంది విమల. దీర్ఘంగా నిట్టూర్చి అన్యమనస్కంగానే ఇంట్లోకి నడిచింది.

ఊరంతా తిరిగి మధ్యాహ్నం వేళకి కరకరలాడే కడుపుల్తో ఇంటికి తిరిగొచ్చారు రంగారావు పరివారం.

తాళం పెట్టిన గుమ్మం ముందు కునికి పాట్లు పడుతోంది పనిపిల్ల. "ఈ వేళప్పుడీవిడెక్కడికి పెత్తనానికి పోయిందీ," అని విసుక్కుంటున్న రంగారావుతో, "అమ్మగారెటో ఎల్లారండి. ఇదిగోండి తాలం సెవి. ఈ సీటీ కూడా ఇమ్మన్నారండి" అంటూ రెండూ రంగారావు చేతుల్లో పెట్టి చక్కా పోయింది పనిపిల్ల. "ఎవరికో ఏ పురుడో, పుణ్యమో అయ్యుంటుంది. ఈవిడ తనెళ్ళకపోతే అక్కడేదో నడవదని ఊహించేసుకుని బయలుదేరి పోయిందిగావుఁను" అని విసుగ్గా ఊహాగానాలు చేస్తూ తలుపు తీసుకుని లోపలికెళ్ళారందరూ. చీటి విప్ప కుండానే బల్లమీద పడేసి, డైనింగ్ టేబుల్ దగ్గర చేరిపోయారు.

ఖాళీ టేబుల్ వెక్కిరించింది. కోడలు వంటింట్లోకి తొంగిచూసింది. వంట చేసిన జాడైనా లేదు. "ఎవరికైనా ప్రాణం మీదికొచ్చిందా ఏమిట్రా. మీ అమ్మ కుక్కరైనా పెట్టకుండా పరిగెత్తిందీ. చూడు చీటీలో ఏం రాసిందో" అందరికీ చీటీ గుర్తొచ్చి పట్టుకొచ్చి విప్పారు.

"నా భర్తా, కోడలూ, కొడుకులూ అందర్నీ ఉద్దేశించి రాస్తున్నానీ ఉత్తరం" అంటూ చదవడం మొదలెట్టాడు చిన్న కొడుకు. "ఏవిట్రోయ్ ఏదో కవిత్వం వెలగబెట్టినట్టుంది మీ అమ్మ ఎక్కడికెళ్ళిందో సూటిగా రెండు ముక్కల్లో రాసి తగలబడకూడదా" విసుక్కున్నాడు రంగారావు. కొడుకు చదవడం సాగించాడు.

"మీరంతా వచ్చినప్పటినుంచీ మీ మాటలన్నీ వింటున్నాను. మీరంతా ఎలాంటి ఇల్లు కట్టించుకోవాలో ఒక ఒప్పందానికి వచ్చినట్టున్నారు. సంతోషం. కొడుకులిద్దరూ లోన్లు పెట్టుకుని తండ్రి ప్రయత్నానికి సాయం చేద్దామని కూడా అనుకుంటున్నారు. మరీ సంతోషం. నిజమే. మీరంతా డబ్బు సంపాదిస్తున్నారు అది ఖర్చుపెట్టి ఇల్లు కట్టించుకోబోయేదీ మీరే. ఇందులో పైసా పెట్టుబడి పెట్టని ఇంటి ఇల్లాలికేం ప్రమేయం ఉంటుందీ అని మీకనిపించింది కాబోలు. ఒక్కళ్ళు కూడా నీ ఉద్దేశం ఏమిటీ? అని నన్నడగలేదు. మీకందులో తప్పేం కనిపించి ఉండదు. కానీ నా మనసు మాత్రం మీ ధోరణిని జీర్ణించుకోలేకపోతోంది. నేనూ ఇదిగో ఇంటి కోసం నా చందా అని నోట్ల కట్టనందిస్తేనే నన్నూ మీ కుటుంబ సభ్యురాలిగా గుర్తిస్తారు కాబోలు.

మీరంతా ఇక్కడికి ట్రాన్స్‌ఫర్లు చేయించుకుని సొంత ఇంట్లో ఉంటాం అని ఉత్సాహపడుతున్నారు. మీ నాన్నగారు కూడా రిటైరయ్యాక చేతులు ముడుచుకు కూచోకుండా అప్పుడే ఏదో కంపెనీలో ఉద్యోగం కూడా సిద్ధం చేసుకున్నారట. అలా అని ఆయన నాతో చెప్పలేదు. మీతో అంటుంటే విని తెలుసుకున్నా. చాలా బాగుంది. కానీ మీలో ఒక్కరికి తట్టిందా? మీరు సొంతింట్లో చేరినా మీమీ ఉద్యోగాలకు పొద్దుననగా వెళ్ళే మీరు సాయంత్రానికి తిండికీ, నిద్రకూ వాడుకోవడానికన్నట్లు ఇంటికి చేరితే, ఇరవై నాలుగ్గంటలూ ఇంట్లో ఉండి మీ ఆకలిదప్పులే కాక, మీకు మిగతా సౌకర్యాలన్నీ సమకూర్చేది నేనేనని ఒక్కరికంటే ఒక్కరికి తట్టిందా? ఇంటి నంటి పెట్టుకునుండి దీన్ని మీకు సుఖంగా ఉండేలా తీర్చి దిద్దేది నేను. పొద్దున్నే లేచి మీరు తాగే కాఫీ దగ్గర్నుంచి రాత్రి మీ పక్కల శుభ్రం దాకా ప్రతీదీ మీకమర్చి పెట్టేది నేను. నేనంటే ఈ ఇంటి ఇల్లాలిని. నేనెందుకు ఈ పనులన్నీ చేస్తానో మీకు తెలుసా? ఇది నా సంసారం. వీళ్ళు నా సంతానం. వీళ్ళంతా నా వాళ్ళు అన్న ప్రేమతో, ప్రతి పనిలోనూ మనసునీ, ఆత్మనీ అంకితం చేసి చేస్తున్నా నేనీ పనులన్నీ. కానీ మీరెవ్వరూ నన్ను మీలో ఒకరనీ, మీతో సమానమనీ అనుకోలేదని తెలుసుకోవడానికి నాకు ముప్ఫై ఏళ్ళు పట్టింది. మీలో ప్రతి ఒక్కరి ఇష్టాఇష్టాలు- ఎవరికేరుచులిష్టమో నిద్రలో లేపి అడిగినా నేను చెప్పగలను. మీలో ఒకళ్ళంటే ఒకళ్ళు నా యిష్టా ఇష్టాలలో ఏ ఒక్కటైనా చెప్పగలరా? నాకంటూ ప్రత్యేకంగా ఇష్టాయిష్టాలుంటాయన్న విషయమే మీకెవ్వరికీ ఇప్పటిదాకా తట్టుండదు. ఇక ముందు తట్టబోదు. మంచి పనివాళ్ళు దొరకడం కష్టమైన ఈ రోజుల్లో అత్తగారింట్లో ఉండడం చాలా ఉపయోగం అని సంతోషిస్తోంది నా కోడలు. తన పుట్టబోయే పిల్లలను చూసుకోవడానికి నన్ను ఉపయోగించుకోవాలంటున్నాడు నా సుపుత్రుడు. ఎందుకు చూడను? నా మనవలను చూసుకోవడం నాకు బరువా? మనస్ఫూర్తిగా చేసుకుంటా వాళ్ళ సేవ కూడా, వాళ్ళ బామ్మగా. కానీ పని మనిషికి బదులు ఈవిడ అనుకుంటూ మీరు మీ పిల్లలను నా చేతికిస్తే అందుకోవడానికి మాత్రం నేను సిద్ధంగా లేను, క్షమించండి. దాదాపు మూడు దశాబ్దాలు పైగా మీ అందరి కోసం ఆత్మార్పణ చేసుకుని ఈ బతుకు గడిపాను. కానీ మీ ఎవ్వరి మనసులోనూ నా కోసం సూదిమొన మోపినంత చోటు కూడా లేదు. ఇక మీ ముఖాలూ చూడాలనిపించడం లేదు నాకు- వెళ్ళిపోతున్నాను. నా మనసునీ, ప్రేమనీ పూర్తిగా దోపిడీ చేసి నా పట్ల ఇసుమంతయినా ఆపేక్ష చూపించలేని స్వార్థపరుల కోసం నా జీవితం వ్యర్థం చేసుకున్నందుకు బాధతో, విరక్తితో చావడానికే పోతున్నానో- మీకు చేసిన పాటి సేవ ఏ ఇంట్లో చేసినా ఇంతోటి నా బతుకు గడవకపోదు అన్న ధీమాతో కొత్తగా బతకడానికే పోతున్నానో- మీకు చెప్పను. అనవసరం! డబ్బుతోనే బంధాలు కలుపుకున్న మీరు కట్టుకోబోయే కొత్త ఇంట్లో ఈ పాత పనిమనిషి మాత్రం ఉండదు. శలవు.

- విమల